ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

జగిత్యాల

జిల్లా వార్తలు

3★★

సోమవారం 13 మే 2024





జగిత్యాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సామగ్రితో పోలింగ్ సిబ్బంది

ఓటుకు వేళాయె..

- నేడు లోక్‌సభ ఎన్నికల పోలింగ్
- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాట్లు పూర్తి
- 7,12,710 మంది ఓటర్లు
- 930 పోలింగ్ కేంద్రాలు
- పోలింగ్ కోసం 4,532 మంది సిబ్బంది
- జిల్లావ్యాప్తంగా 79 రూట్‌లు
- ఎన్నికల నిర్వహణకు సుమారు 300 వాహనాలు
- సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అప్పగించిన అధికారులు
- పల్లెలకు తరలిన ఎన్నికల సిబ్బంది
- పర్యవేక్షించిన కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



జగిత్యాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సిబ్బంది

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సాధారణ ఎన్నికల ప్రధాన ఘట్టమైన పోలింగ్‌కు వేళయింది. అధికారులు ఎన్నికలకు సంబంధించి సర్వం సిద్ధం చేశారు. ఈనెల 13వ తేదీన ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల సమక్షంలో సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అప్పగించారు. కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్ రాంబాబు జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో పోలింగ్ సామగ్రి పంపిణీ తీరును పర్యవేక్షించారు.



కోరుట్లలో పోలింగ్ కేంద్రానికి వెళుతున్న సిబ్బంది

● జిల్లాలో 7,12,710 మంది ఓటర్లు

జగిత్యాల జిల్లాలో కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాలు ఉండగా 7,12,710 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 3,42,216 మంది పురుషులు, 3,70,460 మంది మహిళలు, 34 మంది ఇతరులు ఉన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో 2,45,249 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 1,16,382 మంది పురుషులు కాగా, 1,28,863 మంది మహిళలు, ఇతరులు నలుగురున్నారు. ధర్మపురి నియోజకవర్గంలో 2,30,786 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 1,12,442 మంది పురుషులు కాగా, 1,18,338 మంది మహిళలు, ఇతరులు ఆరుగురు ఉన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో 2,36,675 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 1,13,392 మంది పురుషులు కాగా, 1,23,259 మంది మహిళలు, 24 మంది ఇతరులు ఉన్నారు.

● జిల్లాలో 930 పోలింగ్ కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా 930 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలోని కోరుట్ల నియోజకవర్గంలో 262 పోలింగ్ స్టేషన్లు, జగిత్యాలలో 254 కేంద్రాలు, ధర్మపురిలో 216 కేంద్రాలు, కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని కొడిమ్యాల, మల్యాల మండలాల్లో 108 కేంద్రాలు, సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాల్లో 90 కేంద్రాలున్నాయి. జిల్లాలో 161 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రతీ నియోజకవర్గంలో ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 446 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసి నేరుగా కలెక్టరేట్ నుంచి పర్యవేక్షించనున్నారు. 915 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 495 పోలింగ్ లొకేషన్స్ ఉన్నాయి. సుమారు మూడు వేల మంది పోలీసులతో భద్రతా నిర్వహిస్తున్నారు. మహిళా పోలింగ్ కేంద్రా లు, ఆదర్శ పోలింగ్ కేంద్రాలు, యువ పోలింగ్ కేంద్రా లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

● 4,532 మంది పోలింగ్ సిబ్బంది

జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాలతో పాటు చొప్పదండి నియోజకవర్గంలోని మల్యాల, కొడిమ్యాల మండలాలు, వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల పరిధిలో గల పోలింగ్ స్టేషన్‌లలో 4,532 మంది పోలింగ్ సిబ్బందిని ని యమించారు. ఇందులో పీవోలు 1,104 మంది, ఏపీవోలు 1,104, ఓపీఓలు 2,208 మంది ఉన్నారు. దీనికి తోడు 116 మంది మైక్రోఅబ్జర్వర్లను నియమించారు. జగిత్యాల నియోజక వర్గంలో 1,227 మంది, కోరుట్లలో 1,261 మం ది, ధర్మపురిలో 1,014 మంది, కొడిమ్యా ల, మల్యాల మండలాల్లో 517 మం ది, మేడిపల్లి, కథలాపూర్, బీమా రం మండలాల్లో 431 మంది ఎన్నికల విధుల్లో పాల్గొంటు న్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల కంటే ఇరవై శాతం సిబ్బం దిని అదనంగా అందు బా టులో ఉండే విధంగా పో లింగ్ అధికారుల నియామ కం జరిపారు.



జగిత్యాలలో సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్

● డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా

జగిత్యాలలోని మినీ స్టేడియంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఆధ్వర్యంలో, ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రిటర్నింగ్ ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో, కోరుట్లలో ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో ఎ న్నికల అధికారి, ఆర్డీవో ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి సామగ్రిని అప్పగించారు. జిల్లాలోని పోలింగ్ స్టేషన్లకు 930 ఓటింగ్ యంత్రాలు, 930 కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను ఇప్పటికే పరిశీలించిన అధికారులు ఆయా పోలింగ్ సిబ్బందికి అప్పగించారు. ఒక్కో నియోజకవర్గంలో 15 నుంచి 20 శాతం మేరకు యంత్రాలను రిజర్వ్‌లో పెట్టుకున్నారు.

● జిల్లాలో 79 రూట్‌లు

జగిత్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణ కోసం 776 పోలింగ్ కేంద్రాలను 79 రూట్‌లుగా విభజించారు. కోరుట్ల నియోజకవర్గంలో 26 రూట్ లు, జగిత్యాల నియోజకవర్గంలో 26 రూట్‌లు, ధర్మపురి నియోజకవర్గంలో 27 రూట్‌లను చేశారు. ఒక్కో పో లింగ్ కేంద్రానికి నలుగురు సిబ్బందిని కేటాయించిన అధికారులు ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్లతో పాటు వీవీ ప్యాట్‌లతో పాటు ఇతర వస్తువులను కూడా అప్పగించారు. ఎన్నికల సిబ్బందితో పాటు ఈవీ ఎంలు, ఇతర పరికరాలను తరలించేందుకు సుమారు 300 వాహనాలను ఉపయోగిస్తున్నారు. ఇందులో ప్రైవేట్ బస్సులు, ప్రైవేట్ కార్లను అద్దెకు తీసుకున్నారు.

● 88.84 శాతం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

జిల్లా వ్యాప్తంగా 88.84 శాతం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ పూర్తయింది. జిల్లాలో 3,127 మందికి గానూ 2,778 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో కోరుట్ల నియోజకవర్గంలో 689 మందికి గానూ 637 మంది వినియోగించుకోగా 92.45 శాతం పోలింగ్ జరిగింది. జగిత్యాల నియోజకవర్గంలో 1,492 మందికి గానూ 1,307 మంది వినియోగించుకోగా 87.60 శాతం పోలింగ్ జరిగింది. ధర్మపురి నియోజకవర్గంలో 946 మందికి గానూ 834 మంది వినియోగించుకోగా 88.16 శాతం పోలింగ్ జరిగింది.

● ధర్మపురి నియోజకవర్గంలో..

ధర్మపురి: పెద్దపల్లి పార్లమెంట్ (ఎస్సీ) నియోజకవర్గంలో ఈ నెల 13న జరిగే ఎన్నికల కోసం ఆదివారం అధికారులు సర్వం సిద్ధం చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో గల ధర్మపురి శాసనసభ నియోజకవర్గ పరిధిలో జరిగే పార్లమెంట్ ఎన్నికల కోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. ధర్మపురి శాసనసభ నియోజకవర్గ పరిధిలో గల ధర్మపురి, బుగ్గారం, వెల్గటూర్, ఎండపల్లి, ధర్మారం, గొల్లపల్లి, పెగడపల్లి మండలాల్లో 26 రూట్ల పరిధిలో 26 మంది సెక్టోరల్ అధికారులను నియమించారు.

మొత్తం 269 పోలింగ్ కేంద్రాలకు 145 ప్రదేశాలు గుర్తించి 269 మంది ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, 269 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 620 మంది ఇతర పోలింగ్ అధికారులతో పాటు 10 శాతం మంది అధికారులు, మరి కొంత మంది సిబ్బం దిని అదనంగా నియమించారు. ఎన్నికల కోసం నలుగురు మైక్రో అబ్జర్వర్స్, 16 మంది వీడియో గ్రాఫర్స్, 18 వెబ్ కేంద్రాలు ఏర్పాటు చేసి కెమెరాల ద్వారా కొన్ని గ్రామాల్లో ఓటింగ్ సరళిని ప్రత్యక్ష ప్రసారం చేయడం కోసం శిక్షణ పొందిన వెబ్ కాస్టింగ్ సిబ్బందిని నియమించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే పోలింగ్ అధికారులు, సిబ్బంది స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వద్ద ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఆయా రూట్లకు కేటాయించిన సుమారు 100 వాహనాల ద్వారా ఎన్నికల కోసం వాడే ఈవీఎంలు, ఇతరత్రా సామగ్రితో తరలి వెళ్లారు.

ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఎన్నికల సాధారణ పరిశీలకులు రావిశ్ గుప్తా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి వసతులు కల్పించారని, ఈవీఎంలు ఎలా పని చేస్తున్నాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎన్నికల్లో విధులు నిర్వర్తించే పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు ఎంత మంది హాజరు అయ్యారని, సమస్యలు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. ఏమైన ఇబ్బందులకు గురైతే వెంటనే అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకువాలన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సహాయ అధికారి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దివాకర టీఎస్ ఎన్నికల సిబ్బందికి తగు సూచనలు అందించారు. ఏడు మండలాల తహసీల్దార్లు కృష్ణ చైతన్య, ఎంఎ మా జిద్, ఆర్. శేఖర్, ఎండీ జమీర్, కె. రవి కాంత్, ఆర్. శ్రీనివాస్, రజిత పాల్గొన్నారు.

● కోరుట్ల నియోజక వర్గంలో..

కోరుట్ల: నిజామాబాదు పార్లమెంట్ ఎన్నికలు ఈనెల 13వ తేదిన జరగనున్న పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. సెగ్మెంట్ పరిధిలోని ఆయా గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో సిబ్బంది, అధికారులు తరలివెళ్లారు.

ఆదివారం కోరుట్ల పట్టణంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల భవనంలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రంలో నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కోరుట్ల సబ్‌కలెక్టర్ అనంద్ కుమార్ నుంచి ఎన్నికల సామగ్రిని తీసుకొని పీవోలు, ఏపీవోలు, పోలింగ్ క్లర్క్‌లు ఆయా పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన మెటీరియల్స్‌తో పాటు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తీసుకొని ముందు పరీక్షించుకొని పోలింగ్ కేంద్రాలకు అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. కోరుట్ల సెగ్మెంట్‌లో మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాలతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ కేంద్రాలు ఉన్నాయి. సెగ్మెంట్‌లో 262 పోలింగ్‌స్టేషన్‌లు అధికారులు ఏర్పాటు చేశారు.

నియోజకవర్గాన్ని 26 సెక్టార్లు, 26 రూట్లుగా విభజించారు. నియోజకవర్గంలోని 262 పోలింగ్ స్టేషన్లకుగాను 262 ఈవీఎం వీవీప్యాట్‌లను అందుబాటులో ఉంచారు. నియోజకవర్గంలో 26 మంది జోనల్ ఆఫీసర్లు, 26 మంది రూట్ ఆఫీసర్లకు తోడు నలుగురు జోనల్, నలుగురు రూట్ ఆఫీసర్లను రిజర్వ్‌లో ఉంచారు. సెగ్మెంట్‌లో 262 మంది పీవోలు, 262 మంది ఏపీవోలు, 1048 మంది ఓపీవోలు పోలింగ్ నిర్వహణలో పాల్గొంటున్నారు. 140 లోకేషన్లలో 262 పోలింగ్ స్టేషన్లకుగానూ 25 సమస్యాత్మకం కేంద్రాలుగా అధికారులు గుర్తించారు. వీరితో పాటు అదనంగా 107 మంది సిబ్బందిని రిజర్వ్‌లో అధికారులు ఉంచారు. 62 వాహనాలను వినియోగిస్తున్నారు. ఇందులో 62 బస్సులులతో పాటు 20 ఇతర వాహనాలున్నాయి. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది కేంద్రాల్లో ఏర్పాటు పనులను చేసుకుంటున్నారు. ప్రతీపోలింగ్ కేంద్రంలో వికలాంగులకు అవసరమైన ర్యాంపులు, మూత్రశాలలు, మంచినీటి సదుపాయం, షెడ్లు, విద్యుత్, వసతులను ఏర్పాటు చేశారు. డిస్ట్రిబ్యూషన్ కౌంటర్‌ను పోలీసు జిల్లా ప్రొఫెషనల్ ఎస్పీ శివం ఉపాధ్యాయ, మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు పరిశీలించి పోలీసులకు జాగ్రత్తలను వివరించారు.



జగిత్యాల నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న ఉద్యోగులు



పోలింగ్ స్టేషన్లకు వాహనాల్లో తరలివెళ్తున్న సిబ్బంది



ధర్మపురి నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న ఎన్నికల సిబ్బంది



ధర్మపురి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సిబ్బంది



ధర్మపురిలో సూచనలు ఇస్తున్న రావిశ్ గుప్తా



కోరుట్లలో పోలీసులకు డ్యూటీ వివరాలు తెలుపుతున్న అధికారులు

ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

మెట్‌పల్లి, మే, 12 : ప్రజలు ఎవరి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మెహన్ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 44,807 మంది ఓటర్లు 40 పోలింగ్ కేంద్రాలతో పాటు ఆదర్శ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. వేడి ఎక్కువగా ఉన్నందున ఓటు హక్కు వినయోగించుకునేందుకు కేంద్రాలకు వచ్చిన ప్రజలకు వేడ తాపం కలగకుండా కూలర్లు, టెంట్లు, మంచినీటి సౌకర్యాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సానీటర్ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, లంక లక్ష్మణ్, శేఖర్, గంగరాణి, జుబేర్, సిబ్బంది పాల్గొన్నారు.



మెట్‌పల్లిలోని పోలింగ్ కేంద్రం వద్ద మున్సిపల్ కమిషనర్ మోహన్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పెగడపల్లిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పెగడపల్లి, మే 12: పెగడపల్లి మండల కేంద్రంలో ఆదివారం 2010-11 సంవత్సరానికి చెందిన పదవతరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉల్లాసంగా ఉత్సాహంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని రామకృష్ణ విద్యాలయంలో 2010-11 సంవత్సరంలో పదో తరగతి చదివని విద్యార్థులందరు తమ కుటుంబసభ్యులతో సమావేశానికి హాజరయ్యారు. తమకు చదువులు నేర్పిన గురువులను సన్మానించి ఆత్మీయ సమ్మేళనాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎవరెవరు ఎక్కడ ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నది ఒకరికొకరు తెలియజేసుకున్నారు.

మాతృమూర్తులకు ఘన సన్మానం



మళయాళ సద్గురు గీతామందిరంలో సన్మానం

కరీంనగర్ కల్చరల్, మే12: ఆది శంకరాచార్యులు, భగవద్రామానుజుల జయంతి, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గీతాభక్త సమాజం సభ్యులు మఠాధిపతి విష్ణుసేవానందగిరిస్వామికి పాదపూజ చేశారు. స్వామీజీ ప్రవచనం చేస్తూ రామానుజ, శంకరాచార్యుల వైభవాన్ని, మాతృ మూర్తుల ప్రాశస్త్యాన్ని వివరించారు. మహిళా దినోత్సవంలో భాగంగా 62 మంది మాతృమూర్తులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో సమాజం అధ్యక్షుడు బండ సత్తయ్య, కార్య నిర్వాహకుడు వుప్పల రామేశం, సభ్యులు గుండ రాధాకిషన్, వేంకటయ్య, దామోదర్, భూపతి, గంగన్న, రవీందర్, ప్రభాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల గాలివాన.. ప్రజల ఇబ్బందులు



కంచర్లలో విరిగిపడిన కరెంటు స్తంభం



చందుర్తి మండలంలో మృతి చెందిన ఆవు వద్ద రైతు మల్లారెడ్డి

ఎల్లారెడ్డిపేట, మే 12: ఎల్లారెడ్డిపేట మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసింది. సుమారు గంటపాటు గాలివానకు మండల కేంద్రంతోపాటు, అక్కపల్లి, తిమ్మాపూర్, గుండారం తదితర గ్రామాల్లో చెట్లు నేలకూలాయి. రాకపోకలకు అంతరాయం కలుగకుండా స్థానికులు, యువకులు చెట్లను తొలగించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. ధాన్యం కుప్పలపై ప్లాస్టిక్ కవర్ల కప్పారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చిన ధాన్యం తూకం వేయడంలో నిర్లక్ష్యం వల్ల ఒక్కసారిగా వచ్చే వానకు తడిసిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు.

వీర్నపల్లిలో విరిగిపడిన స్తంభాలు

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు కంచర్ల గ్రామంలో ఆదివారం ఈదురుగాలులతో కూడిన గాలివానకు కరెంటు స్తంభాలు నెలకొరిగాయి. పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఈదురుగాళ్లకు టార్పాలిన్ కవర్లు ఎగిరిపోవడంతో వరి ధాన్యం తడిసింది. కొన్నిచోట్ల తూకం వేసిన ధాన్యం బస్తాలు తడిశాయి. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో దాన్యం వెంటనే కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతుల కోరుతున్నారు.

పిడుగుపాటుతో ఆవు మృతి

చందుర్తి: మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంతో పాటు పిడుగు పడటంతో మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఓ ఆవు మృతి చెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పూడూరు మల్లారెడ్డి చెందిన ఆవు పిడుగు పడి మృతి చెందింది. ఆవు విలువ దాదాపు రూ 50 వేలు ఉంటుందని, బాధిత రైతులు ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

కొడిమ్యాల మండలంలో..

కొడిమ్యాల: కొడిమ్యాల మండలంలో ఆదివారం మధ్యాహ్నం స్వల్పంగా వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. ప్రజలకు ఉక్కపోత నుండి ఉపశమనం లబించింది. అరగంట సేపు వీచిన ఈదురు గాలులకు కోనాపూర్ నుంచి కొడిమ్యాలకు వచ్చు దారిలో చెట్టు నేల కూలింది, తిర్మాలాపూర్ గ్రామంలో వీచిన ఈదురు గాలులకు అదె గ్రామానికి చెందిన తైదల అంజయ్య, శాంతయ్యకు చెందిన ఇళ్ల రేకులు లేచిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఖనిలో భారీ వర్షం

కళ్యాణ్‌నగర్, మే 12: నిన్న మొన్నటి వరకు భానుడి ప్రతాపంతో భగభగమన్న రామగుండం పారిశ్రామిక ప్రాంతం ఆదివారం సాయంత్రం కారుమబ్బులు కమ్ముకుని వర్షం కురిసింది. ఆదివారం పగలు 40.5డిగ్రీల ఉష్ణోగత నమోదు కాగా కనిష్ఠ ఉష్ణోగ్రత 28.0డిగ్రీలు నమోదయింది. మే లో భానుడు ప్రతాపం చూపగా ఆదివారం కురిసిన వర్షంతో కొంత ఉపశమనం కలిగింది. ఎన్నికల నేపథ్యంలో ఆయా పోలింగ్ సెంటర్లకు ఈవీఎంలు చేరిన తరువాత వర్షం పడడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



కొడిమ్యాలలో లేచి కింద పడిన రేకులు



కొడిమ్యాలలో విరిగిపడిన చెట్టు



గోదావరిఖనిలో కురుస్తున్న వర్షం

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



కరీంనగర్‌లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రంను పరిశీలిస్తున్న సీపీ



ఎన్నికల విధులకు హాజరైన పోలీస్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, మే 12: కమిషనరేట్ వ్యాప్తంగా ఉన్న పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సీపీ అభిషేక్ మొహంతి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏదైనా శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే అందుబాటులో వుండే సమీప అధికారులకు తెలియజేయాలన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద జనం గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు.

● డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల సందర్శన

కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిరిసిల్ల బైపాస్ రోడ్డులో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సీపీ అభిషేక్ మొహంతి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వేసేందుకు వచ్చే మహిళలు, వృద్ధులతోపాటు అన్ని వర్గాల ప్రజలతో సిబ్బంబది సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేనిదే ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రాంలోకి వెళ్లవద్దని, వారు పిలిస్తేనే వెళ్ళాలని సూచించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటు ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా కృషి చేయాలన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

కరీంనగర్ క్రైం, మే 12 : పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా ఆదివారం రాత్రి విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. కరీంనగర్ పట్టణంలోని లాడ్జిలు, హోటల్లలో సైతం తనిఖీలు కొనసాగుతున్నాయి. లోకసభ ఎన్నికలకు పోలింగ్ ప్రక్రియ మరికొన్ని గంటల్లో ప్రారంభం కానుండగా, రాత్రి సమయంలో అక్రమ డబ్బు, మద్యం, బహుమతులు పంపిణీలను అరికట్టేందుకు విస్తృతస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఇష్టారాజ్యంగా చెరువు మట్టి తరలింపు



కనగర్తి చెరువులో అక్రమంగా మట్టి తరలించగా ఏర్పడిన గొయ్యి

ఇల్లందకుంట, మే 12: ఇల్లందకుంట మండలం కనగర్తి గ్రామానికి చెందిన చెరువులో ఇష్టారాజ్యంగా చెరువు మట్టి తరలిస్తున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చెరువులోని మట్టిని గృహాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై మండలాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఫిషర్‌మెన్ చైర్మన్ బండి మల్లేష్ అన్నారు. ఆదివారం మండలంలోని కనగర్తి గ్రామ చెరువులో అక్రమంగా మట్టిని తోడిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కనగర్తి గ్రామానికి చెందిన చెరువులు, కుంటలలోని మట్టిని అమ్ముకుంటూ అధికారులు, రాజకీయ పార్టీ నాయకులకు ముడుపులు అప్పచెప్పుతూ చెరువులను అన్యక్రాంతం చేస్తున్నారన్నారు. చెరువుల్లో మట్టిని తీసే జేసీబీ, ట్రాక్టర్లకు సరైన పత్రాలు లేవని గ్రామాల్లో విచ్చలవిడిగా అక్రమ మట్టి మాఫియా కొనసాగుతుందన్నారు. ప్రతి సంవత్సరం ఎండకాలం వచ్చిందంటే చెరువులో నీరు ఎండిపోగానే మట్టి తవ్వకాలకు తెరతీస్తూ గ్రామంలో ఉన్న చెరువులను పనికి రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వాధికారులు స్పందించి చెరువులను కాపాడాలని ఇల్లందకుంట మండల ప్రజలు కోరుతున్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి గల్లంతు

ఎల్లారెడ్డిపేట, మే 12: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఆలకుంట రాజు(35) గ్రామ శివారులోని కొత్తకుంట చెరువులో చేపల వేటకు వెళ్లి ఆదివారం రాత్రి గల్లంతు అయ్యాడని కుటుంబ సభ్యులు, పోలీసుల తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు స్థానికుల సహాయంతో రాజు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని రాజు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఆదివారం రాత్రి చేపల వేటకు మరో వ్యక్తితో కలిసి వెళ్లిన అతను చీకటి పడిన ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు కొత్తకుంట వద్దకు చేరుకున్నారు. గట్టున బట్టలు, చెప్పులు కనిపించడంతో నీటిలో మునిగిపోయాడని రాజుతో వెళ్లిన వ్యక్తి పేర్కొంటున్నాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, కొత్తకుంటలో రాజు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఓ వైపు చీకటి ఉండడం.. మరో వైపు వర్షం కురవడం వల్ల గాలింపునకు ఆటంకం ఏర్పడింది. భార్య సునీత, తల్లిదండ్రులు నర్సవ్వ, లింగయ్య, కొడుకు అక్కడకు చేరుకుని భోరున విలపిస్తున్నారు. సోమవారం గాలింపు చర్యలు చేపడుతామని పోలీసులు వివరించారు.

వడదెబ్బతో మహిళ మృతి

శంకరపట్నం, మే 12: శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన కనుకుట్ల రాధా (40) అనే మహిళ ఆదివారం వడదెబ్బకు గురై మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. రెండ్రోజు లుగా ఎండ తీవ్రత ఉద్రిక్తంగా ఉండడంతో తట్టుకోలేక అస్వస్థతకు గురై మృతి చెందినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటుకే ప్రాధాన్యం

● నిబంధనలు పాటిస్తేనే మేలు ● ఓటు హక్కు వినియోగానికి ఈసీ ఏర్పాట్లు ● నేడు లోక్‌సభ ఎన్నికల పోలింగ్

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటుకే ప్రాధాన్యం దక్కుతుంది. ఓటు హక్కు వినియోగానికి ఎన్నికల సంఘం అమలు చేస్తున్న నిబంధనలను పాటిస్తేనే ప్రయోజనం చేకూరుతుంది. అర్హులందరూ ఓటు వేసేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఓటు సాధారణంగా అందరికీ ఒకేలా ఉంటుంది. కానీ అదే ఓటును కొన్ని సమయాల్లో వేరే పేరుతో పిలుస్తారు.

● జాబితాలో పేరు లేకుంటే..

ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ఓటరు జాబితాలో తప్పనిసరిగా పేరు ఉండాల్సిందే. ఒకవేళ పేరు లేకుంటే ఓటు హక్కు వినియోగానికి అనర్హుడు. ఓటరు తన ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందనేది అందుబాటులో ఉండే బీఎల్‌వోల ద్వారా తెలుసుకోవాలి. బీఎల్‌వోలు ఇచ్చిన ఓటరు స్లిప్ వెనుకాల ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పోలింగ్ కేంద్రం సమాచారం లభిస్తుంది.

● టెండర్ ఓటుకు అవకాశం

ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన వ్యక్తి అప్పటికే వేరే వ్యక్తి తన ఓటును వినియోగించుకున్నాడని తెలిస్తే సదరు ఓటరు ఎన్నికల నిబంధనల మేరకు 49-ఏ ప్రకారం టెండర్ ఓటేసే అవకాశం ఉంటుంది. ఈ ఓటు వేసే వ్యక్తి ఈవీఎంల ద్వారా వేయడానికి వీలులేదు. బ్యాలెట్ రూపంలో ఓటు వేసే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన ప్రక్రియ పీఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఏపీఓ, అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓటరు జాబితాను చెక్ చేసుకుంటారు. ఇప్పుడున్న పరిస్థితిలో దొంగ ఓట్లు వేసే అవకాశం లేదు. జిల్లాలో ఎక్కడా టెండర్ ఓటు నమోదు కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

● వీరికే అనుమతి

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారి ఏజెంట్‌లకు అవకాశం ఉంటుంది. ఓటరుతో పాటు పసిపిల్లలకు అవకాశం ఉంది. పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్స్, సెక్టోరల్ అధికారులు, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన విలేకరులు, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన ఇతరులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.



● వీవీ ప్యాట్‌తో

ఈవీఏంల ద్వారా ఓటు వేస్తే ఓటు పడుతుందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే ఎన్నికల సంఘం వీవీ ప్యాట్ యంత్రాల ద్వారా సమస్యకు పరిష్కారం చూపింది. వీవీప్యాట్ తెరపై ఓటరు వేసిన గుర్తు కనబడుతుంది. దానితో ఓటరు తాను వేసిన ఓటును నిర్ధారించుకుంటారు. వేసిన ఓటు వీవీ ప్యాట్‌పై కనబడితే పారదర్శకంగా ఓటు వేసినట్లు లెక్క. లేకుంటే పీఓకు ఫిర్యాదు చేయాలి.

● నిబంధనలు పాటించాల్సిందే

ఓటు హక్కును వినియోగించుకునేవారు తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలు పాటించాలి. పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థుల గుర్తులు, కండువాలు, వస్త్రాలను ధరించవద్దు. సెల్‌ఫోన్లను తమ వెంట తీసుకెళ్లకూడదు. ఓటు హక్కు వినియోగానికి పోల్ స్లిప్ ప్రమాణికం కాదు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 16 ధ్రువ పత్రాలలో ఏదైనా ఒకటి తీసుకెళ్తే ఓటు వేసేందుకు అవకాశం ఉంది.

● ఓటింగ్ ప్రక్రియ ఇలా..

ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి (పీవో), అదనపు ప్రిసైడింగ్ అధికారి (ఏపీఓ) ఇద్దరు ఇతర పోలింగ్ అధికారులు (ఓపీఓ) విధులు నిర్వహిస్తారు. ఓటర్లు వీరికి సహకరించి ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. మొదట ఏపీఓ ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తి పేరును పోలింగ్ కేంద్రంలోని ఓటరు జాబితాలో ఉంటే ఓటరు గుర్తింపు, క్రమసంఖ్య పేరు గట్టిగా చదివి వినిపిస్తారు. అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లు సరేనని ఒప్పుకుంటే ఓటరు ఎడమ చేతి చూపుడు వేలును చెక్ చేస్తారు. ఓపీఓ-1 మూడు బాధ్యతలు (ఓటరు సిరా చుక్క వేయడం, 17ఏ రిజిస్టార్‌లో పేరు నమోదు, ఓటరు స్లిప్ రాయటం) నిర్వహిస్తారు. దీని తర్వాత ఏపీఓ-2 దగ్గరకు వెళితే పోల్ స్లిప్ తీసుకొని కంట్రోల్ యూనిట్ (సీయూ)లో బటన్ నొక్కి ఓటేసే అవకాశం కల్పిస్తారు. ఓటరు ఓటు వేసే ప్రదేశానికి వెళ్లి ఓటు వేసి బయటకు రావాల్సి ఉంటుంది. ఇలా ఓటింగ్ ప్రక్రియ జరుగుతుంది.

● సందేహాలు ఉంటే పీవోకు ఫిర్యాదు చేయాలి

ఓటరుకు ఏమైనా అనుమానాలు, సందేహాలు ఉంటే ప్రిసైండింగ్ అధికారి (పీఓ) కు ఫిర్యాదు చేయవచ్చు. ఈ విధానాన్ని పీఓ పర్యవేక్షించి రెండు గంటకొకసారి నమోదు అయిన పోలింగ్ వివరాలను సెక్టోరియల్ ఆఫీసర్‌కు సమాచారం అందిస్తారు.

పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లు, స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత

కరీంనగర్ టౌన్, మే 12: పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ బాక్సుల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఇటీవల పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు ఉద్యోగులు వినియోగించుకోగా, బ్యాలెట్ పత్రాలను, హోం ఓటింగ్ బ్యాలెట్ బాక్స్‌లను కలెక్టరేట్‌లో భద్రపరిచారు. కలెక్టరేట్‌లో భద్రపరిచిన బ్యాలెట్ బాక్స్‌లు రాజకీయ పార్టీల నేతల సమక్షంలో ఆదివారం రాత్రి కలెక్టరేట్ నుంచి ప్రత్యేక వాహనంలో ఎస్సారార్ డిగ్రీ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌కు పోలీస్ బందోబస్తు మధ్య తరలించారు. స్ట్రాంగ్‌కు తరలించే ప్రక్రియను కలెక్టర్ పమేలా సత్పతి, పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ అమిత్ కటారియాతో కలిసి పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూంల వద్ద 24 గంటలపాటు బందోబస్తు ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జీఎం నవీన్‌కుమార్, రాజకీయ పార్టీల నాయకులు సత్తినేని శ్రీనివాస్, మడుపు మోహన్, సయ్యద్ బర్కత్ అలీ, కళ్యాడపు ఆగయ్య, రాజేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా శంకర జయంతి ఉత్సవాలు

ధర్మపురి, మే 12: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళలో ఆలయంలోని శంకరాచార్యులకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు పంచోపనిషత్తులతో రుద్రాభిషేకం, హారతి మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. భగవద్రామానుచార్యా జయంతి పురస్కరించుకుని ప్రధాన దేవాలయాల్లో గల అభిషేక మండపంలో రామానుజాచార్యా జయంతి వేడుకల్లో భాగంగా షోడశోపచార పూజ, పంచామృత అభిషేకం సూక్త పారాయణంతో, అష్టోత్తర శతనామ పూజ దివ్య ప్రబంధ పారాయణం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వేదపండితులు మదు శంకర్‌శర్మ, సంగనభట్ల దిలీప్‌శర్మ, గుండి శ్రీనాథ్‌శర్మ, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథ్‌శర్మ, ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు చక్రపాణి కిరణ్‌కుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, జూనియర్ అసిస్టెంట్ దేవయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్ : జగిత్యాల జిల్లా కేంద్రంలోని శుభమస్తు పంక్షన్ హాలులో ఆదివారం జగద్గురు ఆది శంకరాచార్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం హోమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఉన్నారు.



ధర్మపురి శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు

కథలాపూర్ : అద్వైత సిద్ధాంత బోధకుడిగా, హిందువులకు నిత్య స్తోత్రాలను అందించిన జగద్గురువు ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలు మండలంలోని సిరికొండలో గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం యువకులు ఆది శంకరాచార్యుని చిత్రపటంకు పూలమాలలు వేసారు. సనాతన ధర్మం బలోపేతం చేయడానికి కాళికా, గోవర్ధన, శారదా, జ్యోతిర్మటాలను స్థాపించిన ఘనత శంకరాచార్యునికే దక్కిందన్నారు. 108 స్తోత్రాలు, గ్రంధాలు రచించిన శంకరాచార్యున్ని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంచాల మధుసూధన్, దొమ్మాటి గంగనర్సయ్య, అల్లె గంగాధర్, కాశోజి భాస్కర్, నాంపల్లి శ్రీధర్, గట్ల మహేశ్, లస్మయ్య, కృష్ణ, రమేశ్ తదితరులు ఉన్నారు.

పోలింగ్‌కు సిద్ధం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పోలింగ్‌కు అధికారులు అంతా సిద్ధం చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి బందోబస్తు మధ్య పోలింగ్ స్టేషన్లకు ఆదివారం రాత్రి వరకు ఈవీఎంలతో ఎన్నికల సిబ్బంది తరలివెళ్లారు.



రామగుండం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి వెళ్తున్న ఎన్నికల సిబ్బంది



పెద్దపల్లిలో ఎన్నికల విధులకు తరలుతున్న సిబ్బంది



సిరిసిల్లలో సామగ్రితో ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది



కోరుట్లలో ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది



కరీంనగర్‌లో సామగ్రితో ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది

పవర్‌లూం కార్ఖానాలో అగ్నిప్రమాదం



పవర్‌లూం కార్ఖానాలో మంటలను ఆర్పుతున్న సిబ్బంది

సిరిసిల్ల క్రైం, మే 12: సిరిసిల్ల పట్టణంలోని బివైనగర్‌లో అంబటి వేణు పవర్‌లూం కార్ఖానాలో ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో వస్త్ర ఉత్పత్తికి సంబంధించిన రూ 2.50 లక్షల ముడి సరుకు దగ్ధమైంది. పవర్‌లూం కార్ఖానాలో అగ్నిప్రమాదం సంఘటనను వెంటనే స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు తెలియజేయడం వల్ల అగ్నిమాపక యంత్రంతో ఫైర్‌మెన్‌లు సాబీర్, నాగరాజు, నవీన్‌కుమార్‌లు సంఘటనా స్థలానికి సకాలంలో చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటికే వస్త్ర ఉత్పత్తికి సంబంధించిన ముడిసరుకు కాలిబూడిదైంది. పవర్‌లూం కార్ఖానాలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అగ్నిమాపక ఇంచార్జి అధికారి టి. నర్సింహాచారి తెలిపారు.

వైభవంగా పార్వతీ కోటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణానికి హాజరైన భక్తులు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వెల్గటూర్, మే 12: వెల్గటూరు మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కోటిలింగాలలో గోదావరి తీరాన కొలువై ఉన్న శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. అందంగా అలంకరించిన కల్యాణ మంటపంపైన అమర్చిన పీఠంపై స్వామివారల ఉత్సవ విగ్రహాలను నిలిపారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మ, కార్తీక్, శివకిరణ్‌ల మంత్రోచ్ఛరణల మధ్య వైశాఖ శుక్ల పంచమి శంకర జయంతి సందర్భంగా ఆరుద్ర నక్షత్ర యుక్త అభిజిత్ లగ్న పుష్కరాంశ సుముహూర్తాన ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారల కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించి తరించారు. మహిళ భక్తులు స్వామి వారికి ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రేగొండ వైకుంఠం కళావతి, రేగొండ రామన్న మల్లీశ్వరి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణం వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ కార్యనిర్వహాధికారి కాంతారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మానకొండూర్, మే 12: మండలంలోని దేశ్‌రాజ్‌పల్లిలో శనివారం అర్థరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక్కరు మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలు అయినట్లు ఎస్ఐ సురేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని నర్సయ్యపల్లి గ్రామానికి చెందిన మద్దెల తిరుపతి (39) అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనానికి ట్రాక్టర్‌లో శనివారం రాత్రి బయలుదేరారు. రామడుగు మండలంలోని దేశ్‌రాజ్‌పల్లి ఎక్స్ రోడ్డు వద్ద ట్రాక్టర్ వెనకాల వస్తున్న కారు ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తిరుపతి, అతనికి ఇరువైపులా కూర్చున్న కాడే జస్వంత్, తీట్ల విష్ణువర్ధన్ కిందపడిపోగా ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం డ్రైవర్ తిరుపతి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇరు వర్గాల ఘర్షణలో ముగ్గురికి గాయాలు

కోరుట్ల, మే 12: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయలయినట్లు పోలీసులు తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన దినేష్ జాట్, ఈరాంజాట్, నాన్‌రాంజాట్ కోరుట్ల పట్టణంలో ఐస్‌క్రీం వ్యాపారం నిర్వహిస్తున్నారు. వీరి వద్ద ఈశ్వర్ జాట్, రాజేష్ జాట్‌లు పనిచేసేవారు. ఇటీవల ఈశ్వర్ జాట్, రాజేష్‌జాట్‌లు స్వంతంగా ఐస్‌క్రీం వ్యాపారం చేపట్టారు. ఈ క్రమంలో మిగతా ముగ్గురితో విభేదాలు వచ్చాయి. శనివారం అర్ధరాత్రి వీరి మధ్య గొడవ చోటు చేసుకుంది. దీంతో ఈశ్వర్ జాట్, రాజేశ్వర్ జాట్‌లు దినిష్‌జాట్, ఈరాంజాట్, నాన్‌రాంజాట్‌లపై దాడి చేయడంతో వారికి తీవ్ర గాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

జమ్మికుంట,మే12:పట్టణంలోని కొత్తపల్లికి చెందిన కల్లెపల్లి వెంకట రత్నం (45) గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వెంకటరత్నం టైల్స్ వ్యాపారం చేస్తున్నాడు. రైల్వే స్టేషన్‌కు దగ్గరలోని ఇంటికి వెళ్తుండగా రెండవ ప్లాట్ ఫాం దగ్గర గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో మృతి చెంది ఉంటాడని తెలిపారు. రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.మృతునికి భార్య సుకన్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గోదావరిలో దూకి యువకుడి ఆత్మహత్య

ధర్మపురి, మే 12: పట్టణానికి చెందిన నూనె సత్యనారాయణ(35) అనే యువకుడు గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనారాయణ ఇంటిలో ఈనెల 11న మధ్యాహ్నం గొడవపడి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ గురించి వెతికారు. ఆదివారం ఉదయం ధర్మపురికి చెందిన కొందరు జాలర్లు గోదావరి నది బ్రహ్మగుండం నీటిలో మృతదేహం ఉందని తెలిపారు. కుటుంబ సుభ్యులు వెళ్లి మృతదేహం సత్యనారాయణదిగా గుర్తించారు. ఇంట్లో గొడవ పడి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి అన్న నూనె శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

భారీగా నగదు, మద్యం పట్టివేత

● జగిత్యాల జిల్లాలో రూ. 3.97 కోట్ల నగదు స్వాధీనం

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు అయినప్పటి నుంచి ఇప్పటివరకు భారీగా నగదు, లిక్కర్, బంగారాన్ని పోలీసులు, అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో ఈనెల 10వ తేదీ వరకు సుమారు రూ. 3,97,36,336 విలువ గల నగదు, లిక్కర్, గోల్డ్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో రూ. 2,21,53,310 నగదు ఉంది. అదేవిధంగా సుమారు రూ. 14,43,015 విలువ గల సుమారు 2,769 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ. 67,45,011 విలువ ఇతర సామగ్రిని సీజ్ చేశారు. రూ. 90 లక్షల విలువల గల 1.506 కేజీల బంగారం, రూ. 3.95 లక్షల విలువ గల 15.81 గంజాయి పట్టుకున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 612 మంది వ్యక్తులను బైండోవర్ చేశారు. 45 ఆయుధాలు డిపాజిట్ చేశారు.

మద్యం పట్టివేత

రాయికల్, మే12: మండలంలోని అల్లీపూర్ గ్రామంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టగా వాహనంలో రెండు మద్యం కాటన్ బాటిళ్లు పట్టుబడ్డాయి. ఇందులో 96 రాయల్ స్టాగ్ 17 లీటర్ల మద్యం పట్టుబడినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద మద్యాన్ని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎఫ్ఎస్‌టీ టీమ్ వన్ జి.కృష్ణారెడ్డి, ఏఆర్ ఎస్సై విద్యాసాగర్, కానిస్టేబుల్ రాహుల్ ఉన్నారు.

వైభవంగా రామానుజుల జయంతి

ఇల్లందకుంట, మే 12: ఇల్లందకుంట శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయంలో భగవత్ రామానుజుల 1007 జయంతి వేడుకలు ఆదివారం రాత్రి గ్రామ దేవాలయంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రామానుజుల స్వామివారి ఉత్సమూర్తును ఘనంగా అలంకరించి, పల్లెకిలో అసీనులను చేసి బాజాభజంత్రిలు, మేళాతాళాలు నడుమ గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పల్లెకి సేవలో పాల్గొని పునకింతులయ్యారు.



రామానుజు స్వామివారికి పల్లకి సేవ

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ



పనులు పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

గణేష్‌నగర్, మే 12: కరీంనగర్ డివిజన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించారు. కరీంనగర్ సర్కిల్‌లోని రూరల్ డివిజన్ గుండిలో 15 కెవిఎ డిటిఆర్‌ను లారీ ఢీకొట్టడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రుద్రారం, రంగసాయిపల్లిలో విద్యుత్‌ను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. కరీంనగర్ రూరల్ మండలం సిటిజన్ కాలనీలో 100 కెవిఎ ఓల్డ్ డీటీఆర్‌లో ఇంటర్నల్ సమస్యతో చెడిపోవడంతో తక్షణమే డీటీఆర్ ఏర్పాటు చేశారు. హుజూరాబాద్ డివిజన్ జమ్మికుంటలో గాలి దుమారంతో రెండు 8 మీటర్స్ పోల్స్ పడిపోవడంతో అధికారులు తక్షణమే స్పందించి పునరుద్ధరించారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు ఏమైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ నంబర్ 9440811444కు ఫోన్ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో డీఈ రూరల్ తిరుపతి, లక్ష్మారెడ్డి, ఏడీఈలు, సత్యనారాయణరెడ్డి, రాజేందర్, ఏఈలు తిరుపతి, శంకరయ్య సిబ్బంది పాల్గొన్నారు.

లాడ్జిలో ప్రింటింగ్ మిషన్

● పోలీసుల విచారణ

కరీంనగర్ క్రైం, మే 12: కరీంనగర్ బస్టాండ్ సమీపంలోని ఒక లాడ్జిలో ఆదివారం రాత్రి పోలీసులు నిర్వహించిన తనిఖీలలో ఒక ప్రింటింగ్ మిషన్‌తో ఉన్న వ్యక్తులను పోలీసులు విచారించారు. ఓ పార్టీకి చెందిన వారు పోలింగ్ చిట్టీలను ముద్రించేందుకు ఆ ప్రిటింగ్ మిషన్ కలిగిఉన్నట్లు విచారణలో వెల్లడైందని సీఐ సరిలాల్ తెలిపారు. కాగా లాడ్జిలో ఈవీఎం దొరికిందని ప్రచారం జరిగింది. దీనిని తప్పుడు ప్రచారంగా పోలీసు అధికారులు పేర్కొన్నారు.

న్యాయవాదుల హర్షం



మాట్లాడుతున్న న్యాయవాదులు

జగిత్యాల టౌన్, మే 12 : తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల ఆరోగ్య, సంక్షేమం కోసం రూ. 100 కోట్లు కేటాయించినట్లు ఇటీవల ప్రకటించిన సీఎం రేవంత్ నిర్ణయం పట్ల జగిత్యాల బార్ అసోసియేషన్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక దన్యవాదాలు తెలియజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, న్యాయవాదులు చంద్ర శేఖర్‌రెడ్డి, కిషన్ రెడ్డి, సలీం, మహేంద్ర నాథ్, ఓం ప్రకాష్, లక్ష్మీనారాయణ, నిఖిల్ రెడ్డి, నర్సయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆలయం సూచిక బోర్డు ఏర్పాటు



సూచిక బోర్డును ఏర్పాటు చేస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు

మెట్‌పల్లి, మే, 12: మెట్‌పల్లి అనుబంధ గ్రామమైనా వెంకట్రావుపేట గ్రామ శివారులోని పురాతన ఆలయం చిలుకల చిన్నమ్మ దేవాలయానికి నూతన అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపకుడు పసునూరి శ్రీనివాస్ తెలిపారు. శనివారం జాతీయ రహదారి నుంచి ఆలయంకు వెళ్ళడానికి సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి పురాతనమైన ఆలయం అభివృద్ధి గురించి ఎవరు పట్టించుకోలేదని అవేదన వ్యక్తం చేశారు. పూర్వీకుల జ్ఞాపకాల గుర్తుగా ఆలయాన్ని సమష్టిగా అభివృద్ధి పరుచుకోవడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల ప్రసాద్, కొమిరెడ్డి తిరుపతిరెడ్డి, చాట్ల గణేష్, రాంపల్లి రఘుపతి, పోతు శ్రీనివాస్, బోడ్డు సుధాకర్, గంట ప్రవీణ్‌రావు, పసునూరి చిన్నయ్య, పిప్పెర శేఖర్, దొంతుల చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

కొడిమ్యాల, మే 12: మండల కేంద్రంలోని వాగు ఒడ్డున ఉన్న ఆంజనేయస్వామి ఆలయ 14వ వార్షికోత్సవం ఆదివారం ఆలయ కమిటీ, గ్రామ ప్రముఖులు, భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమం, హన్మాన్ చాలీసా పారాయణం, దండకం, చేశారు. అనంతరం గ్రామస్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పూజారి భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు, హన్మాన్ దీక్షాపరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది



రాయికల్ పట్టణంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్



పోలింగ్ బూత్ నంబర్లు వేస్తున్న సిబ్బంది



సింగ్రావుపేటలో ఏర్పాటు చేసిన ఓటరు సహాయ కేంద్రం

రాయికల్, మే 12: రాయికల్ మండలంలో సోమవారం జరుగనున్న లోక్‌సభ పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయినట్లు తహసీల్దార్ ఖయ్యూం తెలిపారు. రాయికల్ మండలంలో పురుషులు 24,417 ఓట్లు ఉండగా, మహిళల ఓట్లు 27,522 ఉన్నట్లు, ఇతరులు ఒక ఓటు ఉన్నట్లు తెలిపారు. మొత్తం 51,994 ఓట్లు ఉండగా, అర్బన్‌లో 12, రూరల్‌లో 48 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తాగునీటి వసతి, వైద్యం, విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టామన్నారు. రాయికల్ పట్టణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లను మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ పర్యవేక్షించి సిబ్బందిక తగిన సూచనలు, సలహాలు అందజేశారు. అలాగే ఓటర్లను ఆకట్టుకునేందుకు సింగ్రావుపేటలో మహిళల కోసం ప్రత్యేకంగా పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి ముస్తాబు చేశారు.

మల్యాల: నేడు జరగనున్న లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండల వ్యాప్తంగా 53 పోలింగ్ స్టేషన్‌లు ఉండగా 39,560 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 20,763 మంది మహిళలు, 18,795మంది పురుషులు, ఇద్దరు ఇతరులు ఉన్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా పలు గ్రామాల్లో ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా పోలింగ్ కోసం ఎన్నికల సిబ్బంది, పోలీసులు బలగాలు ఆదివారం సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మల్యాల సీఐ నీలం రవి, ఎస్సైలు అబ్దుల్‌రహీం, కుమారస్వామి పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

కొడిమ్యాల: మండలంలోని వివిధ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రం వరకు చేరుకున్నారు. పోలీసులతో పాటు, పీవోలు, ఏపీవోలు, సిబ్బంది చేరుకొని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను చూసుకున్నారు.

పెగడపల్లి: పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. లోక్‌సభ ఎన్నికలు సోమవారం జరుగనుండగా పెగడపల్లి మండలంలోని 23 గ్రామాలకు గాను 43 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మండలంలో పురుషులు 17,124, మహిళా ఓటర్లు 18,257 మంది ఓటర్లు మొత్తంగా 35,381 ఓటర్లున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో టెంట్లు, తాగునీటి వసతి, నీడ వసతితో పాటు మండల కేంద్రంలోని 260 నంబరు పోలింగ్ స్టేషన్‌ను మహిళా పోలింగ్ స్టేషన్‌గా ఓటర్లను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. మండలంలో పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను ఆదివారం మధ్యాహ్నం మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్‌రావు పరిశీలించి ఏర్పాట్లలో జాగ్రత్తలు పాటించాలని గ్రామపంచాయతీ అధికారులకు సూచించారు.

వెల్గటూర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండలంలో సోమవారం నిర్వహించనున్న పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి వెల్గటూర్ మండల వ్యాప్తంగా 43 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. 10,698 మంది మహిళలు, 10,488 మంది పురుషులు మొత్తం 21,186 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాగా ఎన్నికలు సజావుగా నిర్వహించేలా ఎన్నికల సిబ్బంది, పోలీసులు బలగాలు ఆదివారం సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ఉమాసాగర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు.

మెట్‌పల్లి రూరల్: లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు మెట్‌పల్లి మండలంలోని కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు శనివారం తహసీల్దార్ శేఖర్ తెలిపారు. మెట్‌పల్లి మండలంలోని 23 గ్రామాల్లో 47 పోలింగ్ కేంద్రాలలో 36,272 మంది ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రతి కేంద్రం వద్ద టెంట్లు ఏర్పాటు, మంచినీటి సదుపాయం కల్పించామని వివరించారు. మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏంతగానో ఆకట్టుకుంటున్నాయి. మండలంలోని ఏఎస్ఆర్, చింతలపేట, చెర్లకొండపూర్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఆదర్శ పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. కేంద్రాల గేటు వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణం మామాడి ఆకులు, కొబ్బరి మట్టలు, అరటి చెట్లతో రంగురంగుల పూలతో అందంగా అలంకరించారు. అదేవిధంగా ఓటింగ్ కేంద్రంలోకి ప్రవేశ ద్వారం వద్ద కూడా ఆకట్టుకునేలా తయరు చేశారు.

మెట్‌పల్లి రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును స్వేచ్ఛను ప్రజలు వినియోగించుకునేలా భద్రత చర్యలు చేపట్టాలని ట్రైనీ ఐపీఎస్ శివ ఉపాధ్యాయ అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి చేపట్టిన భద్రత ఏర్పాట్లపై ఎస్సై చిరంజీవిని అడిగి తెలుసుకున్నారు. పట్టణంతో పాటు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను కట్టుదిట్టం అమలు చేస్తున్నట్లు ఆయనకు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా భద్రతాచర్యలు చేపట్టామని, కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు రాకుండా 144 సెక్షన్ పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కోరుట్ల రూరల్: పార్లమెంట్ ఎన్నికలో బాగంగా ఆదివారం పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాలోజ్బి 35 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాట్లును చేశారు. మండలంలో 30,790 మంది ఓటర్లు ఉన్నారు. ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అధికారులు ఏర్పాట్లను చేశారు. ప్రత్యేక పోలీసు బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నారు.



మల్యాలలో పోలింగ్ స్టేషన్‌కు చేరుకుంటున్న ఎన్నికల సిబ్బంది



చిన్నమెట్‌పల్లికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది



పోలీసులతో మాట్లాడుతున్న ట్రైనీ ఐపీఎస్ శివం ఉపాధ్యాయ

పోలింగ్‌కు భారీ బందోబస్తు

- మోహరించిన పోలీసులు
- గ్రామాల్లో దిగిన పారా మిలటరీ బలగాలు
- సమస్యాత్మకమైన గ్రామాల్లో ప్రత్యేక పోలీసు సిబ్బంది
- జిల్లావ్యాప్తంగా 2,247 మంది పోలీసులు

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. జిల్లాలో సుమారు 2,247 మంది పోలీసులు ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలీసు బలగాలు మోహరించాయి. అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని వ్యాప్తంగా 930 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ప్రత్యేక పోలీసు బలగాలతో పర్యవేక్షిస్తున్నారు. ఇందులో సాధారణ పోలింగ్ స్టేషన్ల 807, సమస్యాత్మకంగా ఉన్నవి 120గా అధికారులు గుర్తించారు. ప్రతీ మండలానికి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారితో ప్రత్యేక పెట్రోలింగ్ పార్టీలు, 97 రూట్ మొబైల్స్ పార్టీలు, 20 క్విక్ రియాక్షన్ టీమ్స్, స్ట్రయికిం గ్ టీమ్స్, స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్స్, బీఎస్ఎఫ్ కంపెనీలు, 880 మంది హోం గార్డులు, సీఐడీ పోలీసులు, కేంద్ర బలగాలను జిల్లాకు రప్పించారు. పోలింగ్ స్టేషన్లలో 347 మంది ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లను నియమించారు. దీనికితోడు పారా మిలటరీ బలగాలను కూడా దించి అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో నిఘా పెట్టారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో తొమ్మిది చెక్‌పోస్టులను ఏర్పాటు చేసిన నిరంతర నిఘా ఉంచుతున్నారు. మొబైల్ చెక్ పోస్టులను సైతం ఏర్పాటు చేశారు. వాహన తనిఖీలు, నాకా బందీలు నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలు లోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటివరకు జిల్లాలో పలు ఎన్నికల నియామా వళి ఉల్లంఘన కేసులు నమోదు చేశారు. ఇతర నియోజకవర్గం నుంచి ప్రచారానికి వచ్చిన వారు స్థానికంగా ఉండరాదని, లాడ్జీలు, హోటళ్లలో బస చేస్తున్న ఇతర ప్రాంతాల వారు, రాజకీయ పార్టీ వారు ఉండకుండా చర్యలు తీసుకుంటున్నారు. పోలింగ్ రోజున వందమీటర్ల లైన్స్‌ను అతిక్ర మించే వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

ధర్మపురి: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ కోసం భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జగిత్యాల అడిషనల్ ఎస్పీ వినోద్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం నియోజకవర్గ పరిధిలో విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బందికి ఆయన తగు సలహాలు సూచనలు అందించారు. ఈ ఎన్నికల్లో ఎస్‌బీ డీఎస్పీ రవీందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, జగిత్యాల డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాస్, ఏడుగురు ఎస్‌ఐలు, 21 మంది ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 17 మంది పీసీలు, 10 మంది మహిళా పీసీలు, 50 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది, 208 మంది హోంగార్డులు, ఏఆర్, డిస్ట్రిక్ట్ గార్డు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ పోలీస్ సిబ్బందికి విధులు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా తగు బందోబస్తు నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలోని నాలుగు గ్రామాల్లో అత్యంత సమస్యా త్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు ఆయన వివరించారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకుని ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతీఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.

కోరుట్ల: నిజామాబాదు పార్లమెంట్ పరిధిలోని కోరుట్ల నియోజకవర్గం లో ట్రైని ఐపీఎస్ శివం ఉపాధ్యాయ పర్యవేక్షణలో మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు అద్వర్యంలో బందోబస్తును నిర్వహించనున్నారు. నలుగురు డీఎస్పీలు, ఎఆర్ సీఐ, సీఐలు ఎనిమిది మంది, ఎస్ఐ, ఏఆర్‌ఎస్‌ఐలు 11 మంది, ఏఎస్ఐ, హెడ్ కానిస్టెబుల్స్ 43 మంది, పోలీస్ సిబ్బంది 110, కేంద్ర బలగాలు, ఇతర రాష్ట్ర పోలీస్ సిబ్బంది 569 మందితో విధులు నిర్వహించనున్నారు. నియోజకవర్గంలో 26 రూట్లలో 26 మొబైల్ పార్టీలతో పాటు ప్రత్యేక బలగాల ద్వారా నిరంతరం పర్యవేక్షించి అవాంఛనీయ సంఘటలు చోటుచేసుకోకుండా బందోబస్తును నిర్వహిస్తున్నట్లు ట్రైనీ ఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు.

కొడిమ్యాల: పార్లమెంట్ ఎన్నికల బందోబస్తుకు మండలంలోని వివిధ గ్రామాల్లో 100 మంది పోలీసులను ఉన్నతాధికారులు నియామకం చేసినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలోని పోలింగ్ స్టేషన్ల వద్ద బందోబస్తు, పోలీస్ పహారా ఉంటుంద న్నారు. పోలింగ్ స్టేషన్ సమీపంలోని ఎలాంటి దుకాణాలను నిర్వహించకూడదన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పోలీసు సిబ్బంది వివరాలను తెలుసుకుంటున్న ట్రైని ఐపీఎస్ శివం ఉపాధ్యాయ



జిల్లా కేంద్రంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

● ప్రశాంత వాతావరణంలో పోలింగ్‌కు చర్యలు

- సన్‌ప్రీత్ సింగ్, ఎస్పీ, జగిత్యాల



జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాము. ఇప్పటికే అవసరమైన పోలీసు సిబ్బందిని ఆయా నియోజకవర్గాల్లో మోహరించాము. సమస్యాత్మక, అల్లర్లు జరిగే ప్రాంతాలపై గట్టి నిఘా ఏర్పాటు చేశాము. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించే వారిపై దృష్టి సారించాము.

జోరుగా ప్రలోభాలు?

- డబ్బు, మందు, మాంసం పంపిణీ

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రచారం ముగియడంతో జిల్లాలో ఆదివారం పలువురు అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టే పనిలో పడ్డారు. నగదు, మందు, మాంసం దర్జాగా పంపిణీ చేయడంతో పాటు కొన్ని చోట్ల నగదు పంపకాలు చేపట్టినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ప్రధాన పార్టీలు ఒకరిపై ఒకరు అధికారులకు సమాచారం ఇచ్చుకోవడంతో చాలా చోట్ల మద్యం పట్టుబడింది. సోమవారం పోలింగ్ ఉండటంతో గెలుపే ధ్యేయంగా ప్రధాన పార్టీలు అన్ని అస్త్రాలను చివరి రోజు ప్రయోగించారు. జగిత్యాల జిల్లాలో కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాలు ఉండగా, ప్రధానంగా పోటీ బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్యే సాగుతోంది. మూడు నియోజకవర్గాల్లోని ప్రధాన పార్టీల నేతలు మండల నాయకులతో సమీక్షించారు. ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు గ్రామాల్లో కాలనీల్లో తిరుగుతూ మందు బాటిళ్లను అందజేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఆదివారం కావడంతో ఇంకో పార్టీ అయితే మందుతో పాటు మాంసాన్ని కూడా అందించి తమకే ఓట్లు వేయాలంటూ అభ్యర్థించినట్లు తెలిసింది. ఇంకో పార్టీవారైతే కుల సంఘాలపై దృష్టి పెట్టి నగదు అందించడంతో పాటు ఇతర సామగ్రిని కూడా అందించినట్లు సమాచారం. ఎన్నికల కమిషన్ మద్యం, మాంసంతో పాటు నగదు పంపిణీ చేయవద్దని ఎన్ని నిబంధనలు పెట్టినా జగిత్యాల జిల్లాలో మాత్రం చివరి రోజు మద్యం ఏరులై పారగా, నగదు పంపిణీ జోరుగా సాగిందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

మల్యాల: పలు గ్రామాల్లో ఓటర్లకు పలు పార్టీల నాయకులు ఆదివారం మద్యం పంపిణీ చేశారు. ఇంటికొక మద్యం క్వార్టర్ సీసాలను అందజేశారు. వైన్స్‌లు మూసివేసినప్పటికీ కొన్ని చోట్ల జోరుగా మద్యం విక్రయించినట్లు పలువురు తెలిపారు. అధనపు ధరలతో విక్రయాలు సాగగా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికలో సందర్భంగా ఆదివారం పోలింగ్ సిబ్బంది, పోలీస్ బలగాలు జిల్లాలోని ఆయా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఈవీఎంలను, వీవీ ప్యాట్ యంత్రాలను ఆయా పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసుకున్నారు.



జగిత్యాల, కోరుట్ల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది, పోలీసులు



కోరుట్ల మండలం గుమ్లాపూర్‌లోని ఆదర్శ పోలింగ్ కేంద్రం

మెట్‌పల్లిలోని ఏఎస్ఆర్ తాండలోని ట్రైబల్ పోలింగ్ కేంద్రం

కోరుట్ల మండలం వెంకటాపూర్‌లోని మహిళ మోడల్ పోలింగ్ కేంద్రం

మల్యాలలోని దివ్యాంగుల మోడల్ పోలింగ్ కేంద్రం